క్లుప్తంగా

కానిస్టేబుల్‌ను పరామర్శించిన ట్రైనీ డీఎస్పీ



ఆస్పత్రిలో కానిస్టేబుల్ లక్ష్మీనారాయణను పరామర్శిస్తున్న ట్రైనీ డీఎస్పీ ధీరజ్

ఆదోని అర్బన్: రెండు రోజుల క్రితం డ్యూటీ ముగించుకుని పెద్దతుంబళం నుంచి ఆదోనికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన పెద్దతుంబళం పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ ఆదోనిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ట్రైనీ డీఎస్పీ ధీరజ్, తాలూకా సీఐ నల్లప్ప, పెద్దతుంబళం ఎస్ఐ మహేష్‌కుమార్ ఆదివారం కానిస్టేబుల్‌ను పరామర్శించారు.

రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న యువకుడు

ఆదోని అర్బన్: పట్టణంలోని ఎస్‌కేడీ కాలనీలోని పిరమిడ్ కేంద్రం వద్ద ఆదివారం శ్రీశ్రీ సిద్ధివినాయక సేవాసంఘం మండప నిర్వాహకులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వినాయక చవితి సందర్భంగా నాలుగు రోజుల పాటు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి యువకులు, పెద్దలు 25 మంది రక్తదానం చేశారు. రెండో సంవత్సరం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆర్గనైజర్లు రాజశేఖర్‌రెడ్డి, శైలజ, విరూపాక్షి తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం బాటిళ్లతో సీఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్

మంత్రాలయం: అక్రమంగా కర్ణాటక రాష్ట్రం నుంచి మద్యం బాటిళ్లు తరిస్తుండగా దాడులు చేసి పట్టుకున్నట్లు మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. ఆదివారం గ్రామాల్లో తనిఖీలు చేస్తుండగా చిలకలడోణ గ్రామానికి చెందిన వెంకటేష్, ఎమ్మిగనూరుకు చెందిన వెంకటేష్‌ల వద్ద నుంచి 240 ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇద్దరి పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యం



చాగిలో స్ప్రే చేస్తున్న పంచాయతీ కార్మికుడు

ఆదోనిరూరల్: ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యమని చాగి గ్రామ సర్పంచ్ వై.రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. ఆదివారం మండలంలోని చాగి గ్రామంలో పారిశుద్ధ్య పనులను చేయించారు. గ్రామంలోని మెయిన్ బజారు, ఆయా కాలనీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పంచాయతీ సిబ్బంది తొలగించారు. బ్లీచింగ్ ఫౌడర్ చల్లించి, స్ప్రే చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కృష్ణ, నాగమణి ఉన్నారు.

కౌతాళంలో పారిశుద్ధ్య పనులు

కౌతాళం: మండల కేంద్రం కౌతాళంలో వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ పాల్ దినకర్ ముమ్మరంగా పారిశుధ్య పనులు చేయించారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో వినాయక వేడుకలను సందర్భంగా భక్తులకు ఇబ్బందులకు లేకుండా ప్రధాన రోడ్డులలో శుభ్రంగా చేయించి బ్లీచింగ్ పౌడర్‌లను చల్లించారు. రోడ్డుల పై చెత్తాచెదారం వేయకుండా భక్తులు సహకరించాలని గ్రామ సర్పంచ్ కోరారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేసిన పూజారులు

హొళగుంద: మాళ మల్లేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో మూలమూర్తులకు జలాభిషేకాలు, సుప్రభాతసేవ, భండరార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి, ఆకుల అలంకరణ, ప్రత్యేక పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామి వారిని దర్శించుకోవడానికి ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



ఎమ్మిగనూరు లక్ష్మీపేటలో హోమం చేస్తున్న దృశ్యం



ఆదోని సంతపేట సర్కిల్‌లో కొలువుదీరిన సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి అవతారంలో వినాయకుడు



ఆదోని మేదర్‌గేరిలో వినాయకుడిని ఆశీర్వదిస్తున్న ఈశ్వరుడు



బ్రాహ్మిణ్ స్ట్రీట్‌లో ముక్కోటి దేవతల ఆశీర్వాదం పొందుతున్న వినాయకుడు



ఆర్టీసీ కాలనీలోని వి.కె.నగర్‌లో ఆంజనేయస్వామి అవతారంలో వినాయకుడు

ఉండ్రాళ్లయ్యా.. దండాలయ్యా

- భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు
- వివిధ రూపాల్లో ఆకట్టుకున్న వినాయక విగ్రహాలు

ఆదోనిఅర్బన్/కోసిగి/కౌతాళం/పెద్దకడబూరు: వినాయక చవితి పండుగను ఊరూరా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం వినాయక చవితి సందర్భంగా వాడవాడలా ఏర్పాటు చేసిన మండపాల్లో నిర్వాహకులు వినాయకులను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు ఆదివారం ఆదోని పట్టణంలోని మండపాల్లో వివిధ రూపాల్లో వినాయకుడు కొలువుదీరి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం వేళల్లో వినాయకులను ప్రత్యేకంగా అలంకరించారు. అదేవిధంగా రోడ్డు పొడవునా విద్యుత్ దీపాలతో భక్తులను ఆకర్షించేలా తీర్చిదిద్దారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచి పెట్టారు.

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు పట్టణంలోని కోర్టు రోడ్డులో శ్రీ శక్తి వినాయక మండలి సభ్యులు వినూత్నంగా రూ.54 లక్షల కరెన్సీ నోట్లు, నాణేలతో ధన లక్ష్మి రూపంలో గణనాథుడిని కొలువుంచారు. అదే విధంగా కొండపేటి ప్రాంతంలో రూ.3లక్షల విలువచేసే రుద్రాక్షలతో నరసింహస్వామి ఆకృతితో తయారు చేసిన గణనాథుడు విశేషంగా ఆకట్టుకొంటుండతో అధిక సంఖ్యలో తరలి వెళ్లి పూజలు చేశారు. అదేవిధంగా లక్ష్మీపేటలో యువకులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

నందవరం : మండలంలోని వాడవాడలా గణపయ్య ప్రత్యేక మండపాలపై కొలువుదీరారు. విశేష రూపాలలో భక్తులను ఆకట్టుకున్నారు. మండల కేంద్రంలో 20, నాగాలదిన్నెలో 10, ముగతిలో 8, కనకవీడులో 4, మాచాపురంలో 3, హాలహర్వి-8, నదికైరవాడిలో 2, పెద్దకొత్తిలిలో 2, గురజాల, రాయచోటి, మిట్టసోమపురం, సోమలగూడూరు, ఇబ్రహీంపురం గ్రామాల్లో గణనాథులు కొలువుదీరారు. మండలంలో 70 గణనాథుడి ప్రతిమలు కొలువు దీరాయని పోలీసులు వెల్లడించారు. నందవరం మండల కేంద్రంలో ముగతి గ్రామంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు, సర్పంచ్ విరుపాక్షి రెడ్డి నేతృత్వంలో గణపయ్యలకు విశేష పూజలు గావించారు.



ఆదోని విక్టోరియాపేటలో గొర్రెల కాపరిగా విఘ్నేశ్వరుడు



కోసిగి వైఎస్సార్ సర్కిల్‌లో కొలువుతీరిన భారీ గణనాథుడికి పూజలు చేస్తున్న దృశ్యం



ఎమ్మిగనూరు: రుద్రాక్షాలతో తయారు చేసిన నరసింహస్వామి రూపంలో గణనాథుడు



ఎమ్మిగనూరు లక్ష్మీపేటలో రక్తదానం చేస్తున్న యువకులు



హనుమాన్ నగర్‌లో అయోధ్య రామయ్య అవతారంలో గణనాథుడు



పట్టణంలోని శివసర్కిల్‌లో ఆకట్టుకుంటున్న భారీ వినాయకుడు



కౌతాళం పాత బస్టాండ్ సమీపంలో



కౌతాళం మెయిన్ రోడ్డు వెలసిన గణనాథుడు



కోసిగి మార్కండేయ స్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ

ఆదోని టౌన్: విజయవాడ, గుంటూరు జిల్లాల్లో వరద బాధితుల సహాయార్థం ఆదోని పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కూటమి ఆధ్వర్యంలో విరాళాల సేకరణకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా భీమాస్ ఫంక్షన్‌హాలులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ, గుంటూరు జిల్లాల్లో వరదల్లో చిక్కుకొని సర్వం కోల్పోయి ఆపన్నహస్తాల కోసం ఎదురుచూస్తున్న బాధితులను ఆదుకునేందుకుగానూ కూటమి ప్రభుత్వం విరాళాల సేకరణ చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోలె పట్టి ప్రధాన రహదారుల్లో తిరిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఒక నెల జీతం విరాళంగా ఇచ్చారు. అలాగే పారిశ్రామికవేత్త విట్టా రమేష్ రూ.లక్ష, చెన్న బసప్ప రూ.25 వేలు, మల్లికవ్వ రూ.50 వేలను విరాళం ఇచ్చారు. సేకరించిన సొమ్మును సీఎం రిలీఫ్ ఫండ్‌కు జమ చేయనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.

ఆదోని రూరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీపీఐ నాయకులు ఆదోని పట్టణంలోని మున్సిపల్ మెయిన్ బజారు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విరాళాల సేకరణ చేపట్టారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.అజయ్‌బాబు, సీనియర్ నాయకులు కె.లక్ష్మిరెడ్డి, పట్టణ కార్యదర్శి సుదర్శన్, మండల కార్యదర్శి కల్లుబావిరాజు పాల్గొన్నారు.

మానవతా దృక్పథంతో ఆదుకుందాం

ఆదోని సెంట్రల్: మానవతా దృక్పథంతో వరద బాధితులకు సహాయం చేద్దామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం ఎస్ఎఫ్ఐ అధ్వర్యంలో విరాళాల సేకరణకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సూరి, గౌస్, నాగరాజు, శశిధర్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు




మాట్లాడుతున్న సీఐ గంగాధర్

గోనెగండ్ల : వినాయక నిమజ్జన సమయంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ గంగాధర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం జరిగే వినాయక నిమజ్జనం వేడుకలను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. గంజిహళ్లి, బైలుప్పల, అగ్రహారం గ్రామాలు ఎల్లెల్సీ కాలువ, హెచ్. కైరవాడి, పిల్లిగుండ్ల, ఒంటెడుదిన్నె, నెరుడుప్పల తదితర గ్రామాలు గాజులదిన్నె ప్రాజెక్టులో నిమజ్జనం చేస్తారన్నారు. వినాయక నిమజ్జన ఘాట వద్ద గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తామని చెప్పారు. నిమజ్జనాన్ని ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల లోపు పూర్తి చేసుకోవాలని మండపాల నిర్వహకులకు సూచించారు. అలాగే వినాయక విగ్రహాల ఊరేగింపులో మద్యం సేవించి అల్లర్లు చేయరాదని, డీజేలకు అనుమతి లేదన్నారు. నిమజ్జనం కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మూడు షాపుల్లో చోరీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ప్రధాన కూడలి శివ సర్కిల్‌లోని మూడు దుకాణాల్లో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. శివ సర్కిల్లోని విష్ణువర్ధన్‌రెడ్డికి చెందిన ఎంఆర్ఎఫ్ షాప్, గుడేకల్ సురేష్‌కు చెందిన రిజర్వేషన్ కౌంటర్ షాపు, సేట్‌కు చెందిన రెయిన్‌బో రెడీమెడ్ బట్టల దుకాణాల్లో కాంప్లెక్స్ వెనక వైపు నుంచి గేట్ తాళాలు పగలగొట్టి దొంగలు లోపలికి ప్రవేశించారు. ముందుగా గుడేకల్ సురేష్‌కు చెందిన రిజర్వేషన్ కౌంటర్ దుకాణంలో షర్టర్ తొలగించి లాకర్‌లో ఉన్న రూ. 70 వేల నగదును దొంగలించారు. పక్కనే ఉన్న విష్ణువర్ధన్‌రెడ్డికి చెందిన ఎంఆర్ఎఫ్ టైర్ల దుకాణం షర్టర్‌ను తొలగించి లోపలికి వెళ్లి సీసీ కెమెరాల ఫుటేజ్‌ను రికార్డింగ్ మెయిన్ స్విచ్‌ను అఫ్ చేసి, రూ. 125 లక్షలు నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిసింది. అలాగే రెయిన్‌బో రెడిమెట్ బట్టల దుకాణంలో రూ.70 వేలకు పైగా నగదును, హుండీలోని మూడు వెండి బిళ్లలను తీసుకెళ్లినట్లు యజమానికి తెలిపారు. దాదాపు మూడు దుకాణాల్లో రూ. 3 లక్షలకు పైగా చోరి జరిగినట్లు బాధితులు చెపుతున్నారు. శనివారం ఉదయం అక్కడికి వచ్చిన కొందరు షాప్స్ షర్ట్స్ తీసి ఉండటం చూసి యజమానులకు సమాచారం అందించారు. కొద్దిసేపటికి అక్కడికి చేరుకున్న యజమానులు పట్టన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ పోలీసులు ఆదివారం తెలిపారు.



చోరీ జరిగిన ఎంఆర్ఎఫ్ టైర్స్ షాప్‌లో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా మేళా

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో నిర్వహిస్తున్న చేనేత హస్తకళా మేళా ప్రజలను విశేషంగా ఆకట్టుకొంటోంది. స్థానిక చేనేత వస్త్రాలతో పాటు పోచం పల్లి, మంగళగిరి, వెంకటగిరి, ధర్మవరం, గద్వాలపట్టు, కాటన్, కలంకారి చీరలు, బెంగాలి చీరలు, షర్టులు, ఖాదీ, జౌపూర్ బెడ్షీట్లు, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, వన్‌గ్రాం గోల్డ్ ఆభరణాలు, జ్యూట్‌బ్యాగ్ తదితర వస్తువులు విక్రయానికి ఉంచారు. నేత కార్మికులను, చేతివృత్తుల వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఆయా వృత్తుల వారిచే అమ్మకాలకు వుంచినట్లు గ్రామీణ వీవర్స్ డెవలప్‌మెంట్స్ సొసైటీ, సాయి బాలాజీ హ్యాండ్‌లూమ్స్, హ్యాండీకాఫ్ట్ నిర్వాహకులు శేషుబాబు తెలిపారు. ఈనెల 16వ తేదీ వరకు మేళా ఉంటుందన్నారు.



మేళాలో చేనేత వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు →

తాగునీటి బోరు విద్యుత్ వైర్ల చోరీ

కోసిగి: మండల కేంద్రం కోసిగి గ్రామ శివారులోని పులికనుమ రిజర్వాయర్ సమీపంలో ఏర్పాటు చేసి తాగునీటి బోరుకు సంబంధించిన కేబుల్ వైర్లను గుర్తు తెలియని దుండగలు చోరీ చేశారు. ఆ ప్రాంతంలో 8 తాగునీటి బోర్లు ఏర్పాటు చేశారు. బోర్లుకు ఏర్పాటు చేసిన రూ.70వేలు విలువ చేసే విద్యుత్ వైర్లను కట్ చేసి శనివారం రాత్రి తీసుకెళ్లారు. దీంతో గ్రామానికి ఆదివారం తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈ మేరకు గ్రామ సర్పంచ్ అయ్యమ్మ, పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది కోసిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

ఆదోని అర్బన్: పట్టణంలోని కోట్ల కూడలిలో ఉన్న ఓ కాంప్లెక్స్‌లో ప్లంబర్, ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న మహబూబ్(25) అనే యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. మహబూబ్ ఆదివారం ఆదోనిలోని కోట్ల కూడలిలోని కాంప్లెక్స్‌లో ప్లంబర్ పని చేస్తుండగా విద్యుత్ వైరు తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. మహబూబ్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చిప్పగిరి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని నగరడోణ గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలు..మండల కేంద్రానికి చెందిన జి.ఎస్. లక్ష్మీనారాయణ, లలితమ్మ కుమారుడు జీఎస్. తేజ ఆలూరు వైపు నుంచి స్వగ్రామానికి రాత్రి 8.30 గంటల సమయంలో బైక్‌పై వస్తున్నాడు. నగరడోణ సమీపంలో బైక్ అదుపు తప్పి కింద పడి తీవ్రగాయాల పాలయ్యాడు. గుర్తించిన స్థానికులు 108 కు సమాచారం ఇవ్వడంతో గుంతకల్లు ప్రభుత్వ అసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం బళ్లారికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.

15న రాష్ట్రస్థాయి భజన పోటీలు

కృష్ణగిరి: మండలంలోని పుట్లూరు గ్రామంలో మారెమ్మ ఉత్సవాల సందర్భంగా ఈ నెల 15వ తేదీన రాత్రి రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. విజేతలకు వరుసగా రూ. 20 వేలు, రూ.15 వేలు, రూ.12వేలు, రూ.10 వేలు,రూ.8వేలు, రూ.6వేలు, రూ. 5వేలు అందించనున్న ట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9989272156, 9014919781, 9398641704 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

15లోపు పంట నమోదు చేసుకోండి



పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత

గోనెగండ్ల : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలను నమోదు చేసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ తెలిపారు. ఆదివారం ఆయన ఏఓ హేమలతతో కలిసి మండలంలోని నేరుడుప్పల, తిప్పనూరు, పుట్టపాశం గ్రామాల్లోని పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ పంట నమోదు చేసుకుంటే కరువు లేదా అధిక వర్షాల వల్ల పంట నష్టం జరిగితే నష్ట పరిహారం అందుతుందన్నారు. అలాగే పంటల బీమా వర్తిస్తుందని, సున్నా వడ్డీ పంట రుణాలకు అర్హులవుతారని చెప్పారు. మండలంలో పంట నమోదు 97 శాతం అయ్యిందని, ఈకేవైసీ 44శాతం మంది రైతులు మాత్రమే చేయించుకున్నారని తెలిపారు.

క్యాబ్ చోరీ కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపుతున్న సీఐ విక్రమసింహా, ఎస్ఐ శ్రీనివాసులు

నందవరం: గత నెల ఆగస్టు 6న జల్సాల కోసం అలవాటు పడి కర్ణాటక రాష్ట్రం బాగల్‌కోటి జిల్లా మతోల్ నియోజకవర్గం మాలాపూర్, శిరోవర్ గ్రామాలకు చెందిన అనిల్ బిరాదర్, సంతోష్‌హుట్టీలు నందవరం మండలంలోని ధర్మపురం టోల్‌గేట్ వద్ద క్యాబ్ చోరీ చేసిన విషయం తెలిసిందే. అందులో మొదటి నిందితుడు అనిల్ బిరాదర్‌ను పోలీసులు ఇదివరకే అరెస్టు చేసి జైలుకు పంపారు. రెండవ నిందితుడు సంతోష్‌హుట్టీని పరారీలో ఉండగా ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. సీఐ విక్రమ సింహా విలేకరులకు వివరాలు వెల్లడించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన వీరిద్దరు అగస్టు 5వ తేదీన హైదరబాద్‌కు చెందిన క్యాబ్‌ను కాచిగూడ నుంచి మంత్రాలయానికి వెళ్లాలని ఉబర్ యాప్ ద్వారా బుక్ చేసుకున్నారు. అదే రోజు రాత్రి 10.50 గంటలకు వికారాబాద్ జిల్లా దోమ మండలం కొడాయిపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ నిమ్మలి ప్రసాద్ క్యాబ్‌ను తీసుకుని కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వెళ్లాడు. క్యాబ్ రాయచూరు మీదుగా మంత్రాలయానికి ఆగస్టు 6వ తేదీ తెల్లవారుజామున 5:30 గంటలకు చేరుకుంది. ఎమ్మిగనూరు వెళ్తుతుండగా నందవరం మండలంలోని హాలహర్వి గ్రామ సమీపంలో పొలాలకు వెళ్లే కాలువ కట్టవైపు కారును వెళ్లమన్నారు. కొంత దూరం వెళ్లాక కారును నిలిపి, డ్రైవర్‌కు అనుమానం రాకుండా ఇద్దరు దొంగలు తమ బ్యాగ్‌లు తీసుకుని స్నానం చేసి వస్తామని వెళ్లారు. ఆ తరువాత డ్రైవర్ నిద్రపోయాక అతని ముఖంపై మత్తుమందు స్ప్రే చేశారు. దీంతో మెలకువ వచ్చిన డ్రైవర్ కేకలు వేయగా ఇద్దరూ దాడి చేశారు. డ్రైవర్ వారి నుంచి తప్పించుకుని రోడ్డువైపు పరిగెత్తి ప్రాణాలు కాపాడుకున్నాడు. ఆ తరువాత కారును ఇద్దరు యువకులు దొంగలించుకెళ్లారు. డ్రైవర్ నందవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్నారు. వెంటనే రూరల్ సీఐ విక్రమసింహా..అప్పటి ఎస్ఐ తిమ్మయ్య, ఏఎస్ఐ ఆనంద్, సీపీలు మల్లికార్జున, సుధాకర్, మల్లేష్, హనుమంతులను అప్రమత్తం చేశారు. డ్రైవర్ వద్ద ఉన్న సెల్‌ఫోన్ నెంబర్ ఆధారంగా నిందితుల ఫోన్ సిగ్నల్ ట్రేస్ చేసి ఆగస్టు 10వ తేదీన గిలకసూగుర్ వద్ద అనిల్ బిరాదర్‌ను అరెస్టు చేశారు. అనంతరం మంత్రాలయం మండలంలోని మాధవరం గ్రామంలో దాచిన క్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అయితే పరారీలో ఉన్న రెండవ నిందితుడు సంతోష్‌హుట్టీని ఆదివారం మధ్యాహ్నం 1.15 గంటలకు ఎమ్మిగనూరు పట్టణంలోని ఆదోని రోడ్డులో ఉన్న ఫైర్‌స్టేషన్ వద్ద రూరల్ సీఐ విక్రమ సింహా నేతృత్వంలో..ఎస్ఐ శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

రహదారులు గుంతలమయం!



ముగతి గ్రామంలో ఆర్ అండ్ బీ రోడ్డు దుస్థితి



నందవరంలో రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు

నందవరం : మండల పరిధిలోని ముగతి గ్రామంలోని ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. అలాగే మండల కేంద్రంలో పోలీసు స్టేషన్ ఎదురుగా ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలకు గుంతల్లో నీరు నిలిచి ప్రయాణికులు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడుగు లోతులో గుంతలేర్పడటంతో నెల రోజులుగా వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అయినా ఆర్ అండ్ బీ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. రోడ్లపై ఏర్పడిన గుంతలకు కనీసం మరమ్మతు కూడా చేయకుండా వదిలేయడంతో వర్షపు నీరు చేరి మడుగులను తలపిస్తున్నాయి. భారీ వాహనాలు వెళ్లినప్పుడు గుంతల్లోని మురుగునీరు ద్విచక్ర వాహనదారులు, పాదచారులపై పడుతుడడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.